సాక్షి
గుంటూరు
శనివారం । 12 । ఏప్రిల్ । 2025



ముగిసిన సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువపత్రాల పునః పరిశీలనలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది.



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన నకిల వెంకటేష్, వెంకటలక్ష్మీ భార్గవి దంపతులు శుక్రవారం రూ.లక్ష విరాళం అందజేశారు.

సేవలు, మొక్కుబడులు నిలిపివేత



దుగ్గిరాల: కంఠంరాజుకొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో మే ఒకటి నుంచి ఐదో తేదీ వరకు ఆర్జిత సేవలు, మొక్కుబడులు తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు ఈఓ కె.సునీల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. అమ్మవారి దర్శనం మాత్రమే యథాతథంగా ఉంటుందని, భక్తులు గమనించి సహకరించాలని కోరారు.

న్యూస్‌రీల్

రాష్ట్ర సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈనెల 13, 14 తేదీల్లో విజయవాడలో జరగనున్న ఏపీ స్టేట్ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారులు వీఎస్ఎస్ లలిత్, ఎస్.చరణ్ కుమార్, వి.హర్షిణి ఎంపికయ్యారని టెన్నిస్ కోచ్ జీవీఎస్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ ఆధారంగా వీరిని ఎంపిక చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర పోటీల్లోనూ పతకాలు తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

మిర్చి యార్డుకు వరుస సెలవులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శనివారం నుంచి వరుసగా మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. శని, ఆదివారాలు యార్డుకు సాధారణ సెలవులు, సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవం పురస్కరించుకుని సెలవు ఇచ్చారు. దీంతో యార్డుకు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్టు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లో రైతులు తమ సరుకును తీసుకురావద్దని కోరారు. సోమవారం అర్ధరాత్రి నుంచి రైతుల సరుకును యార్డులోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. మంగళవారం యథావిధిగా యార్డులో క్రయవిక్రయాలు కొనసాగుతాయని ఆమె వివరించారు.

నేడు టీచర్ బదిలీలు, ఉద్యోగోన్నతులపై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులు, సీనియార్టీ జాబితాలపై శనివారం సాయంత్రం 4 గంటలకు జిల్లా కోర్టు ఎదుట ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, మొహ్మద్ ఖాలీద్ శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాద్, ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకుడు షేక్ జిలానీ పాల్గొని ఆయా అంశాలపై అవగాహన కల్పిస్తారని వివరించారు.

డ్రోన్ల వినియోగంతో సమయం ఆదా



కొరిటెపాడు(గుంటూరు): పురుగు మందుల పిచికారీకి డ్రోన్ల వినియోగంతో రైతులకు సమయం ఆదా అవుతుందని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు చెప్పారు. స్థానిక కృషి భవన్‌లో శుక్రవారం సాయంత్రం డ్రోన్ల నమూనాలను రైతుల అవగాహన కోసం ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డీఏఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్‌కేవీవై పథకం ద్వారా రైతుల గ్రూపులకు 80 శాతం సబ్సిడీపై కిసాన్ డ్రోన్లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. డ్రోన్ల తయారీదారుల ప్రతినిధులు రవికుమార్, సుధీర్ రైతుల సందేహాలను నివృత్తి చేశారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రత్న మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు డ్రోన్లను కొనుగోలు చేయడానికి రుణాల కోసం అన్ని బ్యాంకులకు ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ ప్రతినిధులు, ఏపీ ఆగ్రోస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

15 నుంచి సముద్రంలో చేపల వేట నిషేధం

నిజాంపట్నం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజులపాటు సముద్ర జలాలలో చేపల వేట నిషేధించినట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సాయిసందీప్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సముద్రంలో వివిధ చేపలు, రొయ్యల జాతుల సంతాన ఉత్పత్తి జరుగుతున్న సమయంలో ప్రభుత్వం ప్రతి ఏటా 61 రోజులపాటు వేట నిషేధం అమల్లోకి తెస్తుందన్నారు. ఈ సమయంలో రొయ్య, చేప జాతులు గుడ్లు పెట్టి సంతానోత్పత్తికి దోహదపడే సమయమన్నారు. వేట నిషేధ సమయంలో మండలంలోని మత్స్యకారులు సముద్రంపై వేటకు వెళ్లరాదని తెలియజేశారు. నిషేధాన్ని ఉల్లంఘించి వేటకు వెళ్లిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆట కధర..!

- నిన్న జొన్న.. నేడు మొక్కజొన్న
- పంటలకు దక్కని 'మద్దతు' ధర
- కొనుగోళ్లను పట్టించుకోని ప్రభుత్వం
- మార్కెట్ ధరల్లో దళారులదే రాజ్యం
- మొక్కజొన్న క్వింటాలుకు రూ.300పైగా రైతులకు నష్టం
- ఎకరాకు రూ.10 వేలు కోల్పోతున్న కర్షకులు



ఆరబెట్టిన మొక్కజొన్న పంట



కొల్లిపరలో యంత్రంతో మొక్కజొన్న నూర్పిడి

తెనాలి/కొల్లిపర: అన్నదాతలు పండించే పంటలు చేతికొచ్చే సమయంలో బహిరంగ మార్కెట్లో ధరలు తగ్గిపోతున్నాయి. మద్దతు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాల్సిన ప్రభుత్వం రైతుల గోడును పెడచెవిన పెడుతోంది. ఫలితంగా ఆరుగాలం కష్టించి పంటలు సాగు చేసిన రైతన్నలు నష్టపోతున్నారు. రబీలో పండించిన జొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవటంతో మార్కెట్లో తక్కువ ధరకు రైతులు అమ్ముకోవాల్సి వచ్చింది. మళ్లీ ఇప్పుడు కోతలు ఆరంభమైన మొక్కజొన్న పరిస్థితీ అలాగే ఉంది. మార్కెట్‌లో దళారులు, వ్యాపారులదే రాజ్యమైంది.

గుంటూరు జిల్లాలో మాగాణి చేలల్లో ఖరీఫ్ సీజనులో వరి తర్వాత రబీలో మొక్కజొన్న అధికంగా సాగుచేస్తారని తెలిసిందే. జీరో టిల్లేజ్ విధానంలో సాగుచేస్తూ అధిక దిగుబడులను సాధిస్తున్న ఘనతను డెల్టా రైతులు సాధించారు. ఆ క్రమంలో 2024–25 రబీ సీజనులో జిల్లాలో 49,155 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశారు. నాలుగుసార్లు నీటితడులతో సహా ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. సగటున ఎకరాకు 35 క్వింటాళ్ల చొప్పున దిగుబడులు రావటంతో రైతులు సంతృప్తిగానే ఉన్నారు. ముందుగా తెనాలి వ్యవసాయ సబ్ డివిజన్‌లో కోతకొచ్చింది. వారం రోజులుగా యంత్రాలతో ఒకేసారి కోత, నూర్పిడి చేయిస్తున్నారు. కోతలు ఆరంభించాక మధ్యలో రెండుసార్లుగా పడిన వర్షంతో పనులకు ఆటంకమైంది. మళ్లీ ఇప్పుడు ఊపందుకున్నాయి. మొక్కజొన్నకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,200 కాగా, కోతలు మొదలైనపుడు వ్యాపారులు రూ.2,250 వరకు కొనుగోలు చేయటంతో రైతులు సంతోషించారు. అయితే, వారి ఆనందం వారం రోజులు కూడా నిలవలేదు. ప్రస్తుతం క్వింటాలు రూ.1,900–2,000 చొప్పున మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అదేమంటే మూడురోజుల క్రితం కురిసిన వర్షాలను సాకుగా చెబుతున్నారు. మొక్కజొన్న గింజలో తేమ శాతం ఎక్కువగా ఉందనీ, మరికొంచెం ఆరబెట్టాలని వ్యాపారులు చెబుతున్నారు. ఆరబెట్టి తీసుకెళ్లినా, అదే ధరకు తూకంలోనూ కిలో చొప్పున తగ్గించి, లెక్కగడుతున్నట్టు రైతులు చెబుతున్నారు. దీనితో రైతులు రెండు రకాలుగా నష్టపోవాల్సి వస్తోంది. నిల్వ చేసుకునే అవకాశాలు లేకపోవటంతో రైతులు, వచ్చినకాడికే దక్కుదల అన్నట్టుగా ప్రైవేటు వ్యాపారులకే విక్రయిస్తున్నారు. ఎకరాకు రూ.300 వరకు నష్టపోతున్నారు. అంటే ఎకరాకు రూ.10 వేల వరకు ఆదాయాన్ని కోల్పోతున్నారు, పంట చేతికి వచ్చే ముందు మార్కెట్ ధరలను అంచనా వేసి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల్సిన ప్రభుత్వం ఆ ఊసే పట్టించుకోలేదు. దీనితో ప్రైవేటు వ్యాపారుల ఇష్టా రాజ్యమైంది. నష్టపోవటం కష్టపడిన రైతుల వంతయింది.

తక్కువ ధరకు అమ్ముకున్నాం

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతోనే ప్రైవేట్ వ్యక్తులకు మొక్కజొన్న పంట అమ్ముకున్నాం. మొక్కజొన్న నూర్పిళ్లు చేసిన తరువాత స్వల్పంగా వర్షం పడింది. దీంతో మూడు రోజులు గింజలు ఆరబెట్టాం. అయినా ఇంకా గింజలో తేమ శాతం ఉందన్నారు. ధర కూడా తగ్గిందంటున్నారు. చేసేదిలేక క్వింటాలు రూ.1900కు అమ్మక తప్పలేదు. కొనుగోలు కేంద్రాలు లేక అందరూ దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. ఇప్పటికైన కొనుగోలు కేంద్రాలు తెరిస్తే, కొందరు రైతులకైనా ఉపకరిస్తుంది.

– ఎ.లక్ష్మీనరసమ్మ , మహిళా రైతు, తూములూరు

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

నాలుగు ఎకరాల్లో వేసిన మొక్కజొన్న మిషన్ ద్వారా నూర్పిళ్లు చేయించాను. వాతావరణం సరిగా లేదు. తేలికపాటి వర్షాలు పడ్డాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. క్వింటాలు రూ.2,200లకు అమ్మాల్సిన మొక్కజొన్నను ప్రైవేటు వ్యాపారులు రూ.1,900–2,000లకు అడుగుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం కొనుగోలు చేస్తే బాగుంటుంది.

– ఈదా శివసాంబిరెడ్డి, తూములూరు, రైతు

సమాజ అభ్యున్నతి కోసం
కృషి చేసిన పూలే

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): సమాజం కోసం, మహిళల అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయుడు మహాత్మా జ్యోతీరావు పూలే అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు చెప్పారు. జ్యోతీరావు పూలే జయంత్యుత్సవం సందర్భంగా బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహిళలకూ సమాంతర హక్కులు ఉండాలని, అంటరానితనం నిర్మూలన కోసం ఆయన ఎంతగానో పాటు పడ్డారన్నారు. ఆయన ఆశయన సాధనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పాటు పడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ గొప్ప మహనీయుడు మహాత్మా జ్యోతీరావు పూలే అని కొనియాడారు. బలహీన వర్గాల కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. మహిళలకు విద్య అవసరమని చాటి చెప్పారన్నారు. సమాజంలో అసమానతలు తొలగించేందుకు కృషి చేశారన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయ కర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ మహిళలు ఇంటికి పరిమితం కాకూడదని, వారికి విద్య అవసరమని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతీరావుపూలే అని కొనియాడారు. మహిళల అభ్యున్నతి ఎంతో కృషి చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు విలువ లేకుండా పోయిందన్నారు. మహిళల పట్ల దుర్భాషలాడడం పరిపాటిగా మారిందని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు, పార్టీ నేత మేకతోటి దయాసాగర్, పార్టీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, కొత్తా చిన్నపరెడ్డి, బత్తుల దేవ, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, బైరెడ్డి రవీంద్రారెడ్డి, నందేటి రాజేష్, సి.హెచ్.వినోద్, విజయ్, ఈమని రాఘవరెడ్డి, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతీరావు పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఓటరు కార్డులకు డోర్ నంబర్లు పక్కాగా ఉండాలి

గుంటూరు వెస్ట్: ఓటర్ కార్డులకు డోర్ నంబర్లు పక్కాగా ఉండాలని డీఆర్వో షేక్ ఖాజావలి చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో డీఆర్వో మాట్లాడుతూ ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం తుది ఓటరు జాబితా తయారు చేయాలన్నారు. దీనికి రాజకీయ పార్టీల సూచనలు, సలహాలు ఎంతో కీలకమని తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకునే క్రమంలో ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా జాబితా సిద్ధం చేయాలని చెప్పారు. సమావేశంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, జీఎంసీ అదనపు కమీషనర్ సి.ఓబులేశు, డీసీలు డి.శ్రీనివాసరావు, డి.శ్రీనివాస రావు పాల్గొన్నారు.

వక్ఫ్ స్వాతంత్ర్య పోరాటం

- ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ఆందోళన
- వామపక్షాలు, పలు ముస్లిం సంఘాల మద్దతు
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ రాజీనామా చేయాలంటూ నినాదాలు



గుంటూరు నగరంలో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు



చంద్రబాబు వెన్నుపోటుదారు అని పోస్టర్ ప్రదర్శిస్తున్న ముస్లింలు చిత్రంలో నూరి ఫాతిమా

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): వక్ఫ్ సవరణ బిల్లును తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గుంటూరులో ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన గళం విప్పారు. నినాదాలతో హోరెత్తించారు. వామపక్షాలు, పలు ముస్లిం సంఘాలు ఆందోళనలో పాలుపంచుకున్నాయి. పార్టీలకతీతంగా చేపట్టిన కార్యక్రమం కావడంతో వేదికపై తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ కూడా ఉన్నారు. ముస్లింలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు అని నినదిస్తూ వామపక్షాల నేతలు పోస్టర్ ప్రదర్శించారు. అదే వేదికపై టీడీపీ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఉండడంతో వామపక్ష నాయకులు అసహనం వ్యక్తం చేశారు. వేదిక దిగిపోయారు. అనంతరం వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి, పార్టీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చిన కూటమి పార్టీ నేత, ఎమ్మెల్యే నసీర్ సమాధానం చెప్పాలని నిలదీశారు. కొద్దిసేపు నసీర్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. వక్ఫ్ బిల్లుకు చంద్రబాబు మద్దతు తెలిపి ముస్లింలకు ద్రోహం చేశారని, ఇప్పుడు ఆ పార్టీ నేత ఆందోళనలో పాల్గొని ద్వంద్వ నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. తూర్పు మాజీ శాసన సభ్యుడు షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ పార్టీలకతీతంగా అందరం ఐకమత్యంగా వక్ఫ్ సవరణ బిల్లుపై పోరాడాలని కోరారు. జమియతుల్ ఉలెమా అధ్యక్షుడు ముఫ్తి బాసీద్ మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ ముస్లింలపై కక్ష కట్టాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ వైఖరిపై ధ్వజమెత్తారు. వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగా శనివారం సీపీఐ ఆధ్వర్యంలో గల్లీ టు ఢిల్లీ నినాదంతో నిరసన చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో ముస్లిం సంఘాల నాయకులు, ఆవాజ్ కమిటీ అధ్యక్షుడు చిష్టి, ముస్లిం ఐక్య వేదిక నాయకుడు బాజీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ కార్యదర్శి గులాం రసూల్, సీపీఐ, సీపీఎం నాయకులు, ముఫ్తి, మౌలానా పాల్గొన్నారు.

ముస్లింల వెంటే నా ప్రయాణం

టీడీపీ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ నియామకానికి టీడీపీ ప్రత్యేక శ్రద్ధ వహించిందని పేర్కొన్నారు. ముస్లింల వెంటే తన ప్రయాణమని, పోరాటానికి సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు.

అసమర్థత కప్పిపుచ్చుకునేందుకే జగన్‌పై ఎంపీ ఆరోపణలు

వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మాచర్ల రూరల్: ఎన్నికల్లో ఓట్లు, సీట్లు కోసం ఇచ్చిన హామీలను అమలు చేయక కూటమి నేతలు కుట్రలు పన్నుతూ, తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ఎంపీ లావు కృష్ణదేవరాయలు మాజీ సీఎం వైఎస్. జగన్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అలవిగాని హామీలిచ్చి వాటిని అమలు చేయలేక, ప్రజల సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్‌పై ప్రశ్నిస్తున్న జగన్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షాకు ఫిర్యాదు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విజ్ఞాన్ విద్యా సంస్థలకు చెందిన లావు కృష్ణదేవరాయలుకు రాజకీయంగా ఏ మాత్రం అనుభవం లేకపోయినా, యువకులను ప్రోత్రహించాలన్న ఉద్దేశంతో తమ నాయకుడు జగన్ ఆ రోజు మొదటి సారిగా ఎంపీ అభ్యర్థిగా అవకాశమిచ్చి భారీ మెజార్టీతో గెలిపించినట్లు గుర్తు చేశారు. అధికారం కోసం అడ్డమైన దారులు తొక్కే కృష్ణదేవరాయల దుర్బుద్ధి ఇప్పుడు బయట పడిందని తెలిపారు. కృష్ణ దేవరాయలు ఎంపీగా గెలిచారంటే అది జగన్, పల్నాడు ప్రజలు, వైఎస్సార్ సీపీ కార్యకర్తల గొప్పతనమేనని పేర్కొన్నారు. ఇప్పుడు జగన్‌పై ఉన్న కేసుల గురించి అమిత్‌షా వద్ద కృష్ణదేవరాయలు ప్రస్తావించటమంటే అది ఆయన అజ్ఞానమని చెప్పారు. చంద్రబాబు, లోకేష్‌ల డైరెక్షన్‌లో కృష్ణదేవరాయలు ఆడుతున్న డ్రామా అని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర లేక అన్నదాతలు అప్పులపాలవుతుంటే వారిని ఆదుకోవడంలో ఎంపీగా విఫలమైన కృష్ణదేవరాయలు వరికపూడిసెల ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం ఆయన అసమర్థత తెలుపుతుందని పిన్నెల్లి విమర్శించారు.

వక్ఫ్ ఆధీనంలోకి మస్తాన్ దర్గా..?

- స్వాధీనం చేసుకునేందుకు వచ్చిన వక్ఫ్ అధికారులు
- దర్గా రాముతో ఫోన్‌లో సంప్రదింపులు
- సోమవారం వరకు గడువు



దర్గాను ఆధీనంలో తీసుకునేందుకు వచ్చిన వక్ఫ్‌బోర్డు అధికారులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): నగరంపాలెంలోని హజ్రత్ కాలేషా మస్తాన్ దర్గా ఇప్పుడు వక్ఫ్ ఆదీనంలోకి వెళ్ళనున్నట్టు సమాచారం. వక్ఫ్ కమిటీ ఆదేశాల మేరకు దీనిని స్వాధీనం చేసుకునేందుకు శుక్రవారం జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ముక్తార్ బాషా, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అబ్దుల్ ఖుదూస్, సూపరిటెండెంట్ హుస్సేన్ ఇబ్రహీం బేగ్ పోలీసులతో వచ్చారు. దర్గా వ్యవహారాలను ఎప్పటి నుంచో రావి రామోహన్‌రావు అలియాస్ దర్గా రాము, అతని కుటుంబ సభ్యులు చూస్తున్నారు. దర్గాకు వచ్చే కానుకల్లో నిబంధనల మేరకు ఏడు శాతం వక్ఫ్ బోర్డుకు చెల్లించాలి. అయితే సక్రమంగా దర్గా రాము చెల్లించడం లేదు. రూ.9 లక్షలకు పైగా ఇంకా బకాయి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వక్ఫ్ బోర్డు కమిటీ చైర్మన్ ఉత్తర్వుల మేరకు దర్గా ముతవల్లిగా ఉన్న రామును పదిరోజులపాటు అధికారులు సస్పెండ్ చేశారు. దర్గాను స్వాధీనం చేసుకునేందుకు వచ్చారు. రాము అందుబాటులో లేకపోవడంతో ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. సోమవారం వరకు గడువు ఇవ్వాలని రాము కోరడంతో వక్ఫ్ అధికారులు గడువు ఇచ్చారు. ఇదిలా ఉంటే ఇప్పటి వరకు రాముకు వక్ఫ్‌బోర్డు కమిటీ సభ్యుడిగా వ్యవహరించే ప్రస్తుత తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తి అండదండలు ఉండటంతో దర్గాను ఆధీనంలోకి తీసుకునేందుకు వక్ఫ్ అధికారులకు అడ్డంకిగా మారినట్టు సమాచారం. అయితే రాముపై, అతని కుమారుడిపై ఇటీవల వెల్లువెత్తిన వివాదాల నేపథ్యంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, వక్ఫ్‌బోర్డు సభ్యుడు నసీర్ అహ్మద్ కూడా దర్గాను ఆధీనంలోకి తీసుకోవాలని అధికారులకు హుకుం జారీ చేసినట్టు తెలుస్తోంది.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **4,500** గరిష్ఠం : రూ. **7,500**

మోడల్ ధర రూ. **6,000**

పూలే సేవలు అజరామరం

గుంటూరు వెస్ట్ : మహాత్మా జ్యోతీరావు పూలే జయంత్యుత్సవాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, శాసన మండలి సభ్యులు చంద్రగిరి ఏసురత్నం, జీఎంసీ ఇన్‌చార్జి మేయర్ షేక్ సజిల, బీసీ సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ కె.మయూరి, డీఆర్వో ఖాజావలి తదితర అధికారులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ పూలే సేవలను కొనియాడారు. జ్యోతీరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను హిందూ కాలేజీ సర్కిల్‌లో ఏర్పాటు చేసేందుకు కౌన్సిల్‌లో తీర్మానం చేశామని పేర్కొన్నారు. బీసీ భవనం నిర్మాణానికి అందరూ సహకరించాలన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ పూలే దంపతులు నేటి యువతకు ఆదర్శప్రాయమన్నారు. అనంతరం 400 మంది బీసీ లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.13.08 కోట్ల విలువైన సబ్సిడీ రుణాల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శైలజ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధరరావు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



జ్యోతీరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

తొలి సామాజికతత్త్వవేత్త జ్యోతీరావు పూలే

గుంటూరు ఎడ్యుకేషన్: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం గళం విప్పిన దేశ తొలి సామాజిక తత్త్వవేత్త జ్యోతీరావు పూలే అని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. శుక్రవారం మహాత్మా జ్యోతీరావు పూలే జయంత్యుత్సవం సందర్భంగా జెడ్పీ సమావేశ మందిరంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ పూలే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డెప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతీరావు పూలే

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): మహాత్మా జ్యోతీరావుపూలే గొప్ప సంఘ సంస్కర్త, సామాజిక తత్త్వవేత్త అని ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. శుక్రవారం పూలే జయంతి సందర్భంగా పోలీస్ కార్యాలయ ఆవరణలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడి ప్రజలను చైతన్యపరిచిన గొప్ప ఉద్యమకారుడు పూలే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు (పరిపాలన) రమణమూర్తి, హనుమంతు (ఏఆర్), ఏఓ అద్దంకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

జెడ్పీ పీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల వేతనాల్లో నుంచి మినహాయిస్తున్న నిధులు సకాలంలో జెడ్పీ పీఎఫ్ ఖాతాల్లో జమ చేసేలాలు తీసుకోవాలని జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసుకు ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలోని సీఈవో చాంబర్లో జ్యోతిబసును కలిసి ఎస్టీయూ నాయకులు వినతి పత్రం సమర్పించారు.

ఆరోగ్య సంరక్షణలో ఫార్మా రంగం కీలకం

రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్ తదితరులు

గుంటూరు మెడికల్: ఆరోగ్య సంరక్షణలో ఫార్మా రంగం ఎంతో కీలకమని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి. వీరపాండియన్ అన్నారు. శుక్రవారం గుంటూరు కేపిటల్ హోటల్‌లో బెంగళూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ ఆధ్వర్యంలో ఫార్మాటెక్ కన్వర్జ్ 2025 కార్యక్రమానికి వీరపాండియన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఫార్మా రంగం విశిష్టతను వివరించారు. గౌరవ అతిథి, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య ట్రస్టు సీఈఓ పి.రవి శుభాష్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో ఫార్మా పాత్ర ఎంతో ఉందన్నారు. ఇంకా పలువురు వక్తలు ప్రసంగించారు.

ఇంటర్ ఫెయిల్ అవుతామనే భయంతో ఇల్లు వదిలి వెళ్లిన విద్యార్థినులు

24 గంటల్లో తల్లిదండ్రులకు అప్పగింత

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పెదవడ్లపూడి, తాడేపల్లిలో నివాసముండే ఇద్దరు అన్నదమ్ముల పిల్లలు ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిల్ అవుతామనే భయంతో ఇల్లు వదిలి పారిపోయారు. తాడేపల్లిలో ఉన్న విద్యార్థిని తల్లిదండ్రులు తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి శుక్రవారం వారిద్దరి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఖాజావలి మాట్లాడుతూ గురువారం రాత్రి 11 గంటల సమయంలో తమ పిల్లలు కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి సీఐ కల్యాణ్ రాజు ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టి 24 గంటల్లో వారి ఆచూకీ కనుగొని వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ ఖాజావలి తెలిపారు.



విద్యార్థినులతో తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి

కొత్త ఆవిష్కరణలకు ప్రాణం పోయండి

- యూనివర్సిటీలలో పరిశోధనలు పెరగాలి
- బెర్హంపూర్ బసర్ డైరెక్టర్ ప్రొఫెసర్ అశోక్ కుమార్ గంగూలి

మంగళగిరి: నేటి విద్యార్థులు పరిశోధనా రంగంలో రాణించి కొత్త ఆవిష్కరణలకు ప్రాణం పోయాలని బెర్హంపూర్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, రీసెర్చ్(బసర్) యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ అశోక్ కుమార్ గంగూలీ కోరారు. మండలంలోని నీరుకొండ గ్రామంలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం 9వ రీసెర్చ్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ గంగూలీ మాట్లాడుతూ బోధనతో పాటు పరిశోధనా రంగంలో రాణించేలా ప్రొఫెసర్లు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ప్రాక్టికల్స్‌తో పాటు పరిశ్రమల సందర్శన ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. యూనివర్సిటీ వీసీ డాక్టర్ మనోజ్ కుమార్ ఆరోరా అధ్యక్షతన జరిగిన సమావేశంలో రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా మాట్లాడుతూ రీసెర్చ్ డేను పురస్కరించుకుని కిండబేజాద్ మాదిరిగా నలుగురు ప్రొఫెసర్లుకు ఉత్తమ పరిశోధనా పురస్కారాలను ప్రదానం చేస్తున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ గంగూలీ

విత్తన షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

కొరిటెపాడు(గుంటూరు): వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయం సహాయ సంచాలకులు ఆర్.శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలోని పత్తి విత్తనాల ప్రాసెసింగ్ పరిశ్రమలు, పంపిణీ కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు, రిటైల్ డీలర్ల దుకాణాలు, పార్సిల్, రవాణా కార్యాలయాల్లో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా రికార్డులను పరిశీలించారు. గుంటూరు నగరంలోని వివిధ విత్తనాల దుకాణాల్లో 65 బీటీ పత్తి విత్తన శాంపిల్స్ హెర్బి సైడ్ ట్రైట్ (హెచ్‌టీ) జన్యు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కమిషనరేట్ ఏడీఏ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ హెచ్‌టీ కలిగిన బీటీ పత్తి విత్తనాల ఉత్పత్తి, సాగు, అమ్మకాల జీ కేంద్ర ప్రభుత్వం నిషేధించినట్లు తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్లో ఇటువంటి విత్తనాలు అమ్మకాలు జరగకుండా ఉండటానికి ముందుగానే గుంటూరు జిల్లాలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తనిఖీల్లో సేకరించిన పత్తి విత్తన నమూనాలన్నీ అక్కడే పరీక్ష చేయగా హెచ్‌టీకి సంబంధించిన జన్యువు లేదని నిర్ధారించడమైందన్నారు. అనుమతి లేని విత్తనాలు విక్రయించినా, నిల్వ చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ కమీషనరేట్ కార్యాలయం వ్యవసాయ అధికారి వీఎస్ సురేషన్, స్థానిక వ్యవసాయ అధికారి కె.రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పత్తి విత్తనాల శాంపిల్స్ జన్యు పరీక్షలు నిర్వహిస్తున్న శశిధర్‌రెడ్డి, సురేషన్, రమణకుమార్.

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో గురువారం 589 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మినట్టు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 423 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,225, గరిష్ఠ ధర రూ.12,225, మోడల్ ధర రూ.11,550, కాయలు 166,బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10.400, గరిష్ఠ ధర రూ.11,800, మోడల్ ధర రూ.11,550, మొత్తం 441.750 క్వింటాళ్లు అమ్మకాలు జరిగినట్లు వెల్లడించారు.

యార్డులో 1,27,104 బస్తాలు మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,15,943 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,27,104 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,600 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 54,603 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.